‘వట్టివాగు’ మీద సాము

- వర్షాకాలంలో దాటేదెలా..?
- శంకుస్థాపనకే వంతెన పరిమితం

నెక్కొండ : బ్రిడ్జి లేకపోవడంతో మండలంలోని వట్టి వాగు మీద రాకపోకలు కత్తి మీద సాములా పరిణమించాయంటూ రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కనీసం నడిచే దారిలేక, వాగు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న దుస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో మరీ దారుణం. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు, ప్రజలు వాపోతున్నారు.

వర్షం పడితే రాకపోకలకు తిప్పలు

వర్షం పడితే వట్టివాగు మీద రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. నీటి ఉధృతి పెరిగితే ప్రమాదకరంగా పరిణమించే పరిస్థితులు నెలకొన్నాయి. పెద్దకొర్పోలు–చిన్నకొర్పోలు, నాగారం–పెద్దకొర్పోలు గ్రామాల ప్రజలకు వట్టివాగు అడ్డంకిగా మారిందని చెప్పక తప్పదు. ఆయా గ్రామాల రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు వాగుకు ఇరువైపులా ఉన్నాయి. వ్యవసాయ పనులకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. ఎన్నికల సమయంలో మాత్రమే వట్టివాగుపై బ్రిడ్జి నిర్మాణం తెరమీదకు వచ్చి తదనంతరం విస్మరించడం పరిపాటిగా మారిందంటూ మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


వాగు దాటుతున్న రైతు, పశువులు


వాగుపై బ్రిడ్జి లేని దృశ్యం

శిలాఫలకానికే పరిమితం

చిన్నకొర్పోలు–పెద్దకొర్పోలు వెళ్లే దారిలోని వట్టి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.13.90 కోట్లతో గతేడాది ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద నాటి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాగా నిర్మాణ పనులు నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెక్‌డ్యాంతో కూడిన హైలెవల్ వంతెన నిర్మింపజేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



వట్టి వాగు దాటి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు లేదు. ముఖ్యంగా రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వ్యవసాయ భూములకు రాకపోకలు సాగించాల్సిన వస్తోంది. వర్షాలు కురిస్తే వాగు ఉధృతంగా ప్రవహించడం పరిపాటి. ఈ పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలి..

–రాజులపాటి అశోక్, రైతు, పెద్దకొర్పోలు

పథకాలను వినియోగించుకోండి


లబ్ధిదారుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం: ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సంగెం మండలంలోని, 17వ డివిజన్‌లో పరిధిలోని గ్రామాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి తిరుపతిరెడ్డి ఎస్సారెస్పీ కెనాల్‌లో ప్రమాదవశాస్తు పడి మృతి చెందగా రూ.2.20లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ఎన్ని నిధులైనా కేటాయించడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీజిల్‌లో కల్తీ..!



రాయపర్తి : డీజిల్‌లో కల్తీ జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంలోని హెచ్‌పీ బంకులో తమకు పోసిన డీజిల్‌లో కల్తీ జరిగిందంటూ బాల్‌నాయక్ తండాకు చెందిన నితిన్, సాయి ఆరోపించారు. ఈ మేరకు వారు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సదరు బంకు ఎదుట ఆదివారం డీజిల్ కలిగిన బాటిళ్లతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. హెచ్‌పీ బంకులో తమ ట్రాక్టర్‌లో కొంత డీజిల్ పోయించుకుని, మరికొన్ని లీటర్లను బాటిళ్లలో పోయించుకున్నట్లు తెలిపారు. డీజిల్‌లో కల్తీ జరిగిందని తాము భావిస్తున్నట్లు తెలిపారు. కాగా శాంపిల్ తీశామని, పరీక్ష చేయిస్తామని, కల్తీ జరగలేదని బంకు నిర్వాహకులు తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో భారీగా నల్లబెల్లం, పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జి.వెంకన్న కథనం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ లేని వాహనాన్ని గుర్తించారు. సదరు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నల్లబెల్లికి తరలుతున్న సుమారు రూ.2 లక్షల విలువైన 25 క్వింటాళ్ల నల్లబెల్లం, 15 కిలోల పటిక లభించింది. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ బాదావత్ రాజేశ్‌ను, కార్మికుడు రవిని అదుపులోకి తీసుకోగా బాదావత్ భాస్కర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తరిమెల నాగిరెడ్డికి నివాళి



నర్సంపేట : సీపీఐ(ఎంఎల్) జోనల్ కమిటీ ఆధ్వర్యంలో విప్లవ కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి 48వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద నాగిరెడ్డి చిత్రపటానికి ఏఐఎఫ్‌టీయూ న్యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నాగిరెడ్డి అమరుడై నాలుగు దశాబ్దాలు గడచినా జనం గుండెల్లో, కమ్యూనిస్టుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారని కీర్తించారు. కార్యక్రమంలో నాయకులు ఈర్ల పైడి, బుర్ర ఆనంద్, ఈరెల్లి రాంచందర్, మోడెం శ్రీలత, భూమా అశోక్, బర్ల గౌరయ్య, గొర్రె మొగిలి, ఎలగంటి కుమారస్వామి, శివరాత్రి కుమారస్వామి, అజ్మీర శివరామ్, పూల్‌సింగ్, బాషబోయిన అనిత, బాలకొమురు పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబానికి రూ.లక్ష సాయం

నల్లబెల్లి : అధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన అశ్వారావుపేట ఎస్సైగా పని చేసిన శ్రీరాముల శ్రీను కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 2013 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఆదివారం రూ.లక్ష సాయం అందజేశారు. తొలుత శ్రీను చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నాగరాజు, శ్రీనివాస్, విక్రమ్, నల్లబెల్లి ఏఎస్‌ఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని రాయపర్తికి చెందిన మహ్మద్ మల్సూర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. అనంతరం చందు కొంరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు చెవ్వ కాశీనాథం, నర్సయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

మెపా జిల్లా నాయకుడికి..

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయికి చెందిన మెపా జిల్లా నాయకుడు బుసాని స్వామిని, అతడి సోదరుడు రాజేశ్‌ను వారి తండ్రి బుచ్చయ్య ఇటీవలమృతి చెందిన క్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ పరామర్శించారు. బుచ్చయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు డ్యాగల శ్రీనివాస్, పెండ్యాల కృష్ణ, పెండ్యాల యాదగిరి, కొలువుల రాజమల్లు, పిట్టల కుమార్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వర్ధన్నపేట : నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని జూనియర్ కళాశాలలో 1982–84 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాటి విద్యార్థులు చేరుకుని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్నేహితులతో సందడి చేశారు. తాము ఇంటర్ పూర్తి చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఫొటోలు దిగుతూ ఆనంద డోలికల్లో తేలియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన తమ మిత్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు పట్టణంలోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకోవడంతో నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. బతుకుదెరువు కోసం ఎక్కడ స్థిరపడ్డా ఏటా కలుసుకోవాలని, సాధ్యమైనంత మేరకు సామాజిక సేవలు నిర్వహించాలని తీర్మానించుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజు, నాగరాజు, శ్రుతి, కిరణ్, రంజిత్, చారి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట రూరల్ : పూర్వవిద్యార్థులు

అడుగు వేయలేం.. అవస్థ పడలేం

నల్లబెల్లి : ‘బాబోయ్ రోడ్లు.. అడుగు వేయలేం.. అవస్థ పడలేం..’ అంటూ మండలంలోని గొల్లపల్లి గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గొల్లపల్లిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామంలోని ముఖ్యకూడళ్లు, ప్రధాన రహదారులు వర్షపు నీరు చేరిన దుస్థితి నెలకొంది. ఖాళీ స్థలాలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. రహదారులు దెబ్బతిన్నా శాశ్వత పరిష్కారం లభించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాత్కాలిక మరమ్మతుల పేరిట నిధులు ఖర్చు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. ప్రస్తుతం ఏర్పడిన బురద రోడ్లతో ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. వానాకాలానికి ముందే కనీసం గుంతలు పడిన రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రజలు బహిరంగంగానే మండిపడుతున్నారు. ప్రధాన రహదారులే కాకుండా అంతర్గత రోడ్లు గుంతలతో ప్రయాణికులను తారెత్తిస్తున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. రాత్రివేళ వాహనదారులు, బాటసారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ప్రధాన రహదారితోపాటు అంతర్గత రోడ్లు గుంతలమయం అయ్యాయి. వ్యవసాయ భూములకు, స్మశానవాటికకు వెళ్లే దారి పూర్తిగా బురదమయం అయ్యింది. నడక సాగించలేని దుస్థితి కనపడుతోంది. ప్రజలు ఎడ్లబండ్లపైనే వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి వస్తున్నారు. ఎడ్లబండ్లు లేని ప్రజలు నడిచి వెళ్లేందుకు అవస్థ పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి బురదమయమైన దారుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.


గ్రామంలో బురదమయమైన రహదారి

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆత్మహత్య

- టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

నల్లబెల్లి : తెలంగాణ ఉద్యమకారుడు వద్లూరి సత్యం ఆత్మహత్యకు పాలకులే కారణమని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వద్లూరి సత్యం ఆత్మహత్య చేసుకోగా ఆయన మృతదేహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో సత్యం పోలీసుల లాఠీఛార్జ్‌లో తీవ్ర గాయాల పాలై అనారోగ్యానికి గురయ్యాడని గుర్తు చేశారు. గడచిన పదేళ్లలో సత్యం ఆరోగ్యాన్ని, పరిస్థితిని ప్రభుత్వాలు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. సరైన వైద్యం అందించలేదని చెప్పారు. ఉద్యమకారులు ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు. ఉద్యమకారులకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు రూ.25 వేల పెన్షన్‌తోపాటు ప్రభుత్వ స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జావేద్ మాట్లాడుతూ ఉద్యమకారులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సోల్తీ సాయికుమార్, గాదె శైలజ, మాధవ, బొట్ల పవన్, వేముల రాజు, మామిండ్ల చిన్న ఐలయ్య, కొయ్యడ కుమారస్వామి, ఎన్నమల నర్సయ్య, మామిండ్ల పెద్ద ఐలయ్య, తంగెళ్ల ప్రభాకర్, వేణు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

క్రీస్తునగర్ రోడ్డులో ఇక్కట్లు



చెన్నారావుపేట : మండలంలోని క్రీస్తునగర్ వెళ్లే రోడ్డులో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ దారి మీదుగా సుమారు 300 ఎకరాల వ్యవసాయ భూములకు రైతులు రోజూ వెళ్లి రావడం పరిపాటి. గ్రామంలో సుమారు 10 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డు బురదమయం అయ్యింది. ఈ సందర్భంగా రైతులు సదరు రోడ్డుపై గురువారం నిరసన తెలిపారు. వర్షాకాలంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా గుంతలు పడి బురదమయం అయ్యిందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్డు నిర్మించాలని రైతులు, గ్రామస్తులు శ్రీనివాస్, ప్రవీణ్, శాంసన్, నరేశ్, అశోక్, షడ్రక్, పాల్, ఆందయ్య కోరుతున్నారు.

పాలనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట : పాలనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పట్టణంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలు అమలయ్యే పరిస్థితి కనపడడం లేదని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేలా అన్ని గ్రామాల్లో 10 మంది చొప్పున క్రియాశీలక కార్యకర్తలను తయారు చేసుకోవాలని సూచించారు. పార్టీ మార్పు పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలన్నారు. శ్రేణులకు ఎళ్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. త్వరలో అన్ని గ్రామాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించి సమర్థులైన కార్యకర్తలను గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ బలోపేతం దిశగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనను ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు మార్గం భిక్షపతి, గుజ్జ సంపత్‌రెడ్డి, ఎలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో కార్మికులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఆరుగాలం శ్రమించినా కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం పొందడం లేదని తెలిపారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్మికులకు ప్రభుత్వమే లేబర్ కార్డులు దరఖాస్తు చేయించడంతోపాటు అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం లేబర్ కార్డు కలిగిన కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడితే రూ.50 వేలు, మరణిస్తే రూ.1.30 లక్షలు, ఇద్దరు కూతుళ్ల వివాహానికి రూ.30 వేల చొప్పున, ప్రసవ సాయం రూ.30 వేలు అందిస్తోందని చెప్పారు. ప్రైవేట్ సంస్థలకు కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలని, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని, అనారోగ్యంతో గురైతే రూ.50 వేలు, మరణిస్తే లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని సూచించారు. మునిసిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి ప్రతినెలా సకాలంలో వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, గబ్బెట బాబు, మిథున్, మునిగాల అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య పరిరక్షణ



నర్సంపేట రూరల్ : యోగాతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఆచార్యులు డాక్టర్ రాము తెలిపారు. నర్సంపేట మండలం మహేశ్వరం శివారులోని శివాని క్యాంపస్ (గీతాంజలి గ్లోబల్ స్కూల్)లో పరివార్ ఇన్‌చార్జ్ సదానందం ఆధ్వర్యంలో 21 రోజులపాటు నిర్వహించనున్న యోగా శిబిరం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బ్రహ్మోపదేశం కార్యక్రమం నిర్వహించగా సాధకులకు రాము మంత్రోపదేశం చేసి యోగా సాధన పై ప్రసంగించారు. పరివార్ యోగా చార్యులు వంశీకృష్ణ, రాజు, శంకర్, మాధవచారి, ట్రైనీ నరేంద్రచారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాలంటీర్లు రోజ, నరేశ్, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవు



కార్మికులతో మాట్లాడుతున్న మునీశ్వర్

నర్సంపేట : సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవని సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ స్పష్టం చేశారు. పట్టణంలోని సివిల్ సప్లై గోదాము వద్ద హమాలీ యూనియన్ అధ్యక్షుడు కొత్తగట్టు నర్సింగం అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి మునీశ్వర్ అతిథిగా హాజరై మాట్లాడారు. హమాలీ కూలీ రెండేళ్ల అగ్రిమెంటు గతేడాది డిసెంబర్ 31న ముగియగా కొత్త రేట్లు పెంచాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ద్వారా కమిషనర్‌ను జనవరిలో కలిసి నోటీసు ఇచ్చినా ఇప్పటివరకు స్పందన లేదన్నారు. అగ్రిమెంటు ముగిసి ఏడు నెలలు గడుస్తున్నా జీఓలు రాకపోవడంతో ఈనెల 31న హైదరాబాద్ సోమాజీగూడలోని సివిల్ సప్లై భవనం ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హమాలీ కార్మికులకు ఈఎస్‌ఐ వర్తింపజేయాలని, నూతన గోదాములు నిర్మించి హమాలీలను ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్ అయిన కార్మికులకు పింఛన్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జి.కుమార్, ఎం.మహేందర్, రాజు, రవి, మహేందర్, కిశోర్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

వర్ధన్నపేట : మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని సెర్ప్ సీసీ గోలి కొమురయ్య సూచించారు. మండలంలోని ఇల్లందలో గంగ, తుంగభద్ర గ్రామైక్య సంఘాల వార్షిక సమావేశాన్ని పద్మశాలీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. వార్షిక నివేదికలోని ఆదాయ, వ్యయాలను వివరించారు. ఇప్పటివరకు వార్షిక ఆదాయం రూ.7.93 లక్షలు రాగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ప్రణాళిక రూపొందించగా సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా సీసీ కొమురయ్య మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకాన్ని మహిళా సంఘాల సభ్యులు వినియోగించుకుని వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. వీఓల ద్వారా ప్రభుత్వం అందించే సేవలతో సాధికారత సాధించాలని చెప్పారు. సమావేశంలో మండల అధ్యక్షురాలు ఎడ్ల అరుణ, ఎస్‌పీ ఈసీ సీఆర్‌పీ మహబూబా, బొంతల మౌనిక, వీఓ ప్రతినిధులు మోడెం కవిత, స్వప్న, ఎల్లమ్మ, సుమలత, నీరజ, ఆకుల ప్రవంతి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొమురయ్య

దళిత నాయకులపై ఆరోపణలు తగవు

నర్సంపేట : దళిత సామజిక వర్గానికి నాయకులపై బీసీ, ముదిరాజ్ సంఘం నాయకులు ఆరోపణలు తగవని భూపోరాట సమితి కన్వీనర్ మంద ప్రకాశ్, కులపెద్దలు గనిపాక సంజీవ, బాణాల శ్రీనివాస్, మాదాసి రవి కోరారు. అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నంబర్ 121లోని భూమి కోసం పోరాడి కేసుల పాలై ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్, కోర్టులు, న్యాయవాదుల చుట్టూ తిప్పుతూ నోటీసులు ఇప్పిస్తూ ఇబ్బందులకు గురి చేసినా ఓపికతో ఉంటున్నామని చెప్పారు. సర్వే నంబర్ 121లోని భూమిపై తమకే అన్ని హక్కులు ఉన్నాయన్నారు. బీసీ సంఘాల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన డ్యాగల శ్రీను ఆరోపణలు మానుకోకుంటు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గనిపాక సంజీవ, బాణాల శ్రీనివాస్, మాదాసి రవి, బాణాల రాంబాబు, వేల్పుగొండ రాజు, మాదాసి కృష్ణ, పసునూరి యశోద, మాదాసి భారతమ్మ, కంచర్ల మంగమ్మ, బొచ్చు వరమ్మ, ఇసాక్, సతీశ్, పోగుల ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.